తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ| జనగాం |ములుగు నిర్మల్ |మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్
మంగళవారం
10 ఫిబ్రవరి 2026
పేజీలు : 08

# ప్రచారం ముగిసింది... ప్రలోభం మిగిలింది...

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 9, (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. ఇక ఓటర్లను ప్రలోభ పెట్టడమే మిగిలింది. మున్సిపల్ ఎన్నికలు ఈనెల 11న ఉండగా ఎన్నికలకు 48 గంటల ముందు ప్రచారం ముగుస్తుంది. కాగా మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ నుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య 34 వార్డులకు సంబందించిన ఆయా పార్టీల అభ్యర్థుల తరపున జోరుగా ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ నుంచి స్టార్ క్యాంపైనర్ మాజీ మంత్రి హరీష్ రావు కార్నర్ మీటింగ్లో పాల్గొన్నారు. ఎంఐఎం నుంచి చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ 25వార్డులో గడపగడపకు ప్రచారం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం స్టార్ క్యాంపైనర్లు ఎవరు రాకున్నా ఎమ్మెల్యే గడ్డం వినోద్ గడపగడపకు ప్రచారం చేశారు. మేమేం తక్కువ తినలేదని రెబల్ అభ్యర్థులు సైతం ప్రచారంతో హోరెత్తించారు. రెబల్ అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు ఎవరికి గెలుపు అవకాశాలను దెబ్బ తీస్తారో, లేక వారే ప్రభంజనం సృష్టిస్తారో అనే అనుమానాలు కలుగుతున్నాయి. టికెట్ రాని అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలో దిగి పార్టీకి చేసిన సేవలను వివరిస్తూ, తమకు జరిగిన అన్యాయానికి మద్దతుగా తమకే ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. ఇన్ని రోజుల ప్రచార పర్వంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో మైకుల మోతతో దద్దరిల్లి పోయిన బస్తీలు మూగ నోము పట్టాయి.

### ప్రలోభాలకు సిద్ధం...

ప్రచారం ముగిసింది, ఇక మిగిలింది ప్రలోభమే అని ఓటర్లు ఆశగా చూస్తున్నారు. ఇన్ని రోజులు సాదాసిదా జరిగిన ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ప్రచారం ముగింపుతో ప్రలోభాల పర్వానికి తెర లేసింది. మందు, విందు, చిందులు, మహిళలకు చీరలు, ఇతరత్రా కానుకలు అభ్యర్థులు సిద్ధం చేసుకున్నారు. స్థానికంగా లేని వారికి ఫోన్లు చేసి డిజిటల్ పేమెంట్ చేస్తాం, ఇంకా ఎంకావాలో అడగండి ఇస్తాం కానీ ఓటు మాత్రం మాకే వేయాలంటూ ఓటర్లకు గాలలు వేస్తున్నారు. ఇవే కాకుండా ఓటుకు వెయ్యి నుంచి 5 వేల రూపాయల వరకు ఖర్చు చేసైనా కౌన్సిలర్ గా గెలవాలనే పట్టుదలతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నారు. ఇలా ప్రలోభాలకు తెర లేవడంతో ఓటర్లు ఎవరి వైపు నిలబడుతారో అనే సంశయం ఏర్పడింది. ఈనెల 13న ఓట్ల లెక్కింపు వరకు కూడా గెలుపు ధీమాతో పోటీ చేసిన అభ్యర్థులందరు ఉన్నారు. పట్టణ ప్రజలు ప్రలోభాలకు లొంగుతారా, లేక అభ్యర్థుల గుణగణాలను చుస్తారో ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాల్సిందే.





# చివరి రోజు అన్ని పార్టీల విస్తృత ప్రచారం

- **ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థించిన అభ్యర్థులు**
- **గల్లీలు, తండాల్లో మైకుల మోత**
- **సాయంత్రం తో ముగిసిన ప్రచారపర్వం**
- **11న పోలింగ్‌కు అంతా సిద్ధం**

**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 09(జనం సాక్షి) :** మున్సిపాలిటీ , కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఆయా పార్టీల అభ్యర్థుల ప్రచారం చివరి రోజు సోమవారం హోరెత్తింది. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ పూర్తయి ఉపసంహరణల అనంతరం గత కొన్ని రోజులుగా ఆయా పార్టీల అభ్యర్థులు తమ ప్రచార వేగాన్ని పెంచారు. ప్రధానంగా కాంగ్రెస్ , బి ఆర్ ఎస్, బిజెపి పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. తమను గెలిపించాలని అభ్యర్థులు, తమ అభ్యర్థులను గెలిపించాలని ఆయా పార్టీల నేతలు ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల నిబంధనలో భాగంగా సోమవారం సాయంత్రం ప్రచారానికి తెరపడింది. ప్రధానంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు ఉన్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బి ఆర్ ఎస్, బిజెపి ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్ లో ఇతర పార్టీ వాళ్లు సుమారు 55 మంది పోటీలో ఉన్నారు. ఇందులో మహిళలు 26 మంది పోటీ చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మిగతావారు పురుషులు ఉన్నారు. మొత్తం సుమారు 10 వేల 519 ఓటర్లు వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్నట్టు స్థానికులు తెలిపారు. వర్ధన్నపేట సిటీ తో పాటు డిసి తండా ఆ పక్కనే ఉన్నటువంటి మరో 10 తండాలు కూడా ఈ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయి. ఈనెల 11న పోలింగ్ 13న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధిత అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ సత్య శారద సమావేశాలు నిర్వహించి ఎన్నికలను కౌంటింగ్ ను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి తెలియచేశారు.. ప్రధానంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీలు, యాదవ, రెడ్డి, కాపు, వెలమ, గౌడ, కుమ్మరి, వడ్డెర, ఎస్టీ మొదలైన సామాజిక వర్గానికి చెందినవారు ఎక్కువగా ఉన్నారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నుండి స్థానిక ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, జిల్లా డిసిసి అధ్యక్షులు అయూబ్ నాయకులు కార్యకర్తలు ప్రచారం చేయగా, బిజెపి, బీఆర్ఎస్ పార్టీల నుండి కొండేటి శ్రీధర్, గంటా రవి, ఆరూరి రమేష్ నాయకులు, జిల్లా పార్టీ నేతలు కార్యకర్తలు ప్రచారం చేశారు. ప్రస్తుతం ఈ మూడు పార్టీల వాళ్లు ఎవరికివారు తగ్గకుండా ప్రచారాన్ని కొనసాగించారు. ఎవరు ప్రచారానికి వెళ్లిన ఓటర్లు మాత్రం తాము మీకే వేస్తాం అంటూ ప్రచారానికి వెళ్లిన వాళ్లను సంతృప్తి పరిచారు. అయితే వాళ్ల ఓట్లు ఎవరికి పడతాయో ఓటింగ్ రోజు, ఓట్ల లెక్కింపు రోజే తెలుస్తుంది. అయితే వర్ధన్నపేటలో గత మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డులకు గాను 10 వార్డులు బి ఆర్ ఎస్ గెలవగా,1 వార్డు బిజెపి, 1వార్డు కాంగ్రెస్ గెలుచుకున్న పరిస్థితి. కానీ ఇప్పుడు పరిస్థితి మూడు పార్టీల మధ్య పోటీ ఉన్నట్టు కనిపిస్తున్న ప్రధానంగా కాంగ్రెస్, బి ఆర్ ఎస్ ల మధ్యనే నువ్వా నేనా అన్నట్లు పోటీ ఉన్నట్టు సమాచారం. ఏది ఏమైనా ఈనెల 13న కౌంటింగ్ తర్వాతనే ఎవరు గెలిచారు ఎవరు ఓడారు అనేది తెలుస్తుంది.

# పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జనరల్ అబ్జర్వర్



**జనగామ ప్రతినిధి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి):** ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించి భరోసా ఇవ్వాలని..ఎన్నికల అబ్జర్వర్ నర్సింహా రెడ్డి అన్నారు.జనగాం మున్సిపాలిటీ లోని జ్యోతి నగర్ పరిధిలో గల సేయింట్ మేరీస్ హై స్కూల్, నెహ్రు నగర్ లో మండల పరిషత్ పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ లను సోమవారం జనరల్ అబ్సర్వర్ నర్సింహా రెడ్డి పరిశీలించారు. ఎన్నికలు పకడ్బందీగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అబ్సర్వర్ సూచించారు. ఈ కార్యక్రమం లో నోడల్ అధికారి మాత్య నాయక్,లైజనింగ్ అధికారి అన్వేష్, మున్సిపల్ వార్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు మున్సిపాలిటీ పరిధిలో 144 సెక్షన్ అమలు

- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



**ములుగు బ్యూరో,ఫిబ్రవరి09(జనం సాక్షి):** ములుగు మున్సిపాలిటీలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు2026 నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సెక్షన్ 144 (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్) భారతీయ నాగరిక భద్రతా సంహిత 2023 లోని సెక్షన్ 163ను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ దివాకర టి.ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు, ములుగు మున్సిపాలిటీలో ఎన్నికలు ఫిబ్రవరి 11 2026న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియలో కీలకమైన చివరి 48 గంటలు (పోలింగ్‌కు ముందు) మరియు 24 గంటలు (పోలింగ్ అనంతరం) అత్యంత సున్నితమైనవిగా పరిగణించబడతాయని, ఈ నేపథ్యంలో ప్రజా శాంతి భద్రతల దృష్ట్యా ఈ ఆదేశాలు జారీ చేసినట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఫిబ్రవరి 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుంచి ఫిబ్రవరి 12వ తేదీ గురువారం సాయంత్రం 5.00 గంటల వరకు మొత్తం 72 గంటలు పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఈ సందర్భంగా ములుగు మున్సిపాలిటీ పరిధిలో ఎవరు కూడా గుంపులుగా ఉండటం, ర్యాలీలు, ఊరేగింపులు, ప్రజా సమావేశాలు నిర్వహించకూడదని ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు.ప్రజలందరూ ఎన్నికల సమయంలో చట్ట నిబంధనలను పాటించి, ఎన్నికలు ప్రశాంతంగా,స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

## వరంగల్ టాస్క్ ఫోర్స్ మరియు, సివిల్ పోలీస్ ఆధ్వర్యంలో రేషన్ బియ్యం పట్టివేత



**నెక్కొండ, ఫిబ్రవరి 9( జనం సాక్షి ):** నెక్కొండ మెడల కేంద్రంలోని గర్నేపల్లి జితేందర్ రెడ్డి తండ్రి రాజిరెడ్డి, వయసు: 44 సంవత్సరములు, కులం: రెడ్డి, వృత్తి: వ్యాపారం, పనికర గ్రామం, నెక్కొండ గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఒక రూమ్ లో 'వెంకటేశ్వర' ట్రేడర్స్ పేరుతో వ్యాపారం చేస్తూ, గత కొంతకాలంగా చుట్టుపక్కల గ్రామాలలోని రేషన్ కార్డ్ రేషన్ కార్డుదారుల వద్ద నుండి పిడిఎస్ బియ్యమును తక్కువ రేటుకు కొనుగోలు చేసి, పిడిఎస్ బియ్యం ఎక్కువ రేటుకు అమ్ముకొని లాభాలు సంపాదిస్తున్నాడు. విషయంలో ఈరోజు నమ్మదగిన సమాచారం మేరకు నేరస్థుడు గర్నేపల్లి జితేందర్ రెడ్డి యొక్క వెంకటేశ్వర ట్రేడర్స్ షాప్ దగ్గర తనిఖీ చేసి షాపులో నుండి 140 తెల్లని బ్యాగులు లో గల, సుమారుగా 70 క్వింటాళ్లు పిడిఎస్ బియ్యమును స్వాధీన పరుచుకోనైనది. వాటి విలువ సుమారుగా 1,82,000/- కలదు.నేరస్తునిపై కేసు నమోదు చేయనైనది, నెక్కొండ ఎస్సై మహేందర్ తెలిపారు.

## గృహ నిర్మాణ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా తెప్పల శ్రీనివాస్ రెడ్డి



**కాటారం ఫిబ్రవరి 9 (జనం సాక్షి ):** కాటారం మండలం గృహ నిర్మాణ అసోసియేషన్ సభ్యులు అందరు కలిసి నాగులమ్మ దేవస్థానం పరిధిలో మీటింగ్ ఏర్పాటు చేసుకుని గృహ నిర్మాణ అసోసియేషన్ ఎన్నికలు సుమారుగా 30 షాప్ ల వారు కలిసి ఎన్నికలు నిర్వహించటం జరిగింది. దీనిలో గౌరవ అధ్యక్షులు గా తాటి బాపు గౌడ్ , అధ్యక్షుని గా తెప్పల శ్రీనివాస్ రెడ్డి , ప్రధాన కార్యాదర్శి గా కొట్టే సతీష్ ఉప అధ్యక్షనిగా బొమ్మ ప్రభాకర్ క్యాషియర్ మారగోని సంతోష్ , ఎన్నుకోబడ్డారు. ఈ రోజు కాటారం మండల గృహ నిర్మాణ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ యూనియన్ ఉన్నతి కోసము కృషి చేసి వ్యాపారస్తుల అభ్యున్నతి కోసము కుటుంబ సభ్యులకు షాప్ ఓనర్ మరణిస్తే 50,000-00 రూపాయలు మరియు షాప్ లోని కుటుంబ సభ్యులు మరణిస్తే వారికీ చేదోడు వాదోడుగా 10,000-00 రూపాయలు యూనియన్ తరుపున అందజేయటానికి , యూనియన్ లో ప్రతి ఆదివారం షాప్లు క్లోజ్ చేసి ఒకటే షాప్ ఓపెన్ లో ఉంచి మండల ప్రజానీకానికి యూనియన్ తరుపున మా సేవలు అందజేయటం జరుగుతుంది అని యూనియన్ ప్రతినిధులు తెలిపారు .ఈ సమావేశములో యూనియన్ సభ్యులు శ్రీనివాస్ , రాజు , ఉదయ్ , వెంకన్న , తిరుపతి , మోహన్ మరియు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలించిన డీసీపీ



**పాలకుర్తి, ఫిబ్రవరి 09(జనంసాక్షి)** ఈ నెల 14 నుంచి 18 వరకు శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను జనగాం వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించడమే కాకుండా జాతరకు తరలివచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వాహనాలతో వచ్చే భక్తులు పార్కింగ్ స్థలాలలో వాహనాలను నిలిపి స్వామి వారల దర్శనార్థం వెళ్లాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపరాద న్నారు. దర్శనార్థం క్యూలైన్లో వెళ్లాలని సూచించా రు. భక్తులు నిబంధనలు పాటించాలని సూచించా రు. ఆయన వెంట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ జానకీరాంరెడ్డి, ఎస్సై దూలం పవన్ కుమార్, అలయ సూపరిండెంట్ కొత్తపెల్లి వెంకటయ్య. తదితరులు ఉన్నారు.

# గూడూరులో కేటీఆర్ సందడి

### కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు..

**మహబూబాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 9 (జనం సాక్షి):**మహబూబాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల సమరానికి బీఆర్ఎస్ గులాబీ దళం సమాయత్తమైంది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు బయలుదేరిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు గూడూరు మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా గూడూరులోని "టిల్లు టీ హోటల్" వద్ద కేటీఆర్ తన వాహనాన్ని ఆపారు. సామాన్యుడిలా హోటల్‌లోకి వెళ్లిన ఆయన, వేడి వేడి చాయ్ తాగుతూ కొద్దిసేపు సేదతీరారు. హోటల్ యజమానిని, అక్కడ ఉన్న స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.కేటీఆర్‌ను అంత దగ్గరగా చూసిన స్థానికులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. ఎంతో ఉత్సాహంగా వారందరితో ముచ్చటించిన కేటీఆర్, అనంతరం తన పర్యటనను మహబూబాబాద్ వైపు కొనసాగించారు.

ఈ సందర్భంగా గూడూరుకు చెందిన మరుగుజ్జు యువకుడు దారావత్ వినోద్‌కు జీవనోపాధి కల్పించేలా రూ.2 లక్షల వ్యయంతో షాప్ ఏర్పాటు చేయిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఆయన మనస్ఫూర్తి హామీపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బిరవెల్లి భరత్



కుమార్ రెడ్డి బానోత్ రవికుమార్ వేణుగోపాల్ రెడ్డి టిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటకృష్ణారెడ్డి మాజీ వైస్ ఎంపీపీ అరె వీరన్న సీనియర్ నాయకులు వాంకుడోత్ కటార్ సింగ్ రామన్న నాయక్ బానోత్ బోడ కిషన్ మహమ్మద్ రఫీ చీదురు వెంకన్న బాలు తదితరులు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్‌లో చేరిన సీనియర్ జర్నలిస్ట్ బేతి సతీష్ యాదవ్



**ములుగు,ఫిబ్రవరి09(జనం సాక్షి):**ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బేతి సతీష్ యాదవ్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.ఈ మేరకు బిఆర్ఎస్ పార్టీ వెంకటాపూర్ మండల అధ్యక్షులు లింగాల రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పార్టీ లో చేరారు.ఈ మేరకు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు లు సతీష్ కి కండువా కప్పి బిఆర్ఎస్ లోకి ఆహ్వానించారు.ఈ సందర్బంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ రాబోయే రోజులు బీఆర్ఎస్ పార్టీయేనని అన్నారు.మేధావులు,వక్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు.గత 15 సంవత్సరాలుగా మీడియా లో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేసిన సతీష్ పార్టీలో చేరడం అభినందనీయమని కొనియాడారు. బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి సతీష్ కృషి చేయాలని వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.జిల్లాలో మంచి గుర్తింపు ఉన్న సతీష్ తమ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ములుగు జిల్లా కోసం జర్నలిస్ట్ లతో కలసి బ్రాహ్మణపల్లి చెక్ పోస్ట్ నుంచి ములుగు వరకు పాదయాత్ర నిర్వహించిన సతీష్ కి తమ పార్టీ లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు.అనంతరం వారు సతీష్ సమావేశమై పార్టీ బలోపేతం కోసం భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాల పై చర్చించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్క రమేష్,పోరిక గోవింద్ నాయక్,సకినాల భవాని,భూక్య జంపన్న,ములుగు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సానికొమ్ము రమేష్ రెడ్డి,వేముల బిక్షపతి,ములుగు పట్టణ అధ్యక్షులు చెన్న విజయ్, నర్సాపూర్ సర్పంచ్ గై రుద్రమదేవి, సీనియర్ నాయకులు బిక్షపతి ,లింగాల రమణారెడ్డి,పోశాల వీరమల్లు,చింతి రెడ్డి ప్రసాద్ రెడ్డి, చింతి రెడ్డి అనోజ్ రెడ్డి,చింతి రెడ్డి రవీందర్ రెడ్డి,వీరబోయిన సాంబయ్య యాదవ్, సోమిరెడ్డి రవి,బోయిని చిన్న రవి, మెరుగు సతీష్,భాష వేణి అశోక్ యాదవ్, బోయిన సాదయ్య,కొలనుపాక రవీందర్, గువ్వ రాజు, కార్పోతుల సత్యం,మూల రత్నాకర్, జనగాం రవీందర్, పోరిక హర్జి నాయక్, ఆషాడపు దేవేందర్,ఎండి అలీ మియా, విజేందర్ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెపై ఏరియా అధికారులతో జిఎం సమీక్ష



**శ్రీరాంపూర్(జనంసాక్షి):** ఏరియా సింగరేణి జిఎం శ్రీనివాస్ ఈ నెల 12వ తేదీన జరగబోయే సమ్మెపై ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా జిఎం మాట్లాడుతూ సమ్మె వల్ల సంస్థకు సుమారు 77 కోట్ల రూపాయల నష్టం వాటిల్లే అవకాశం ఉందని,ఉద్యోగులు సుమారు 12 కోట్ల రూపాయల జీతాలను నష్టపోతారని తెలిపారు.సమ్మె జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉద్యోగులు సమ్మెకు దూరంగా ఉండి సంస్థ పురోగతి, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో సహకరించాలని కోరారు.భూగర్భ ఉపరితల గనుల నుంచి బొగ్గు రవాణా నిరంతరంగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్ఓటు జిఎం సత్యనారాయణ,ఏరియా ఇంజనీర్ టి.రమణ రావు,ఎజిఎం పి.సుమలత,శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ చిప్ప వెంకటేశ్వర్లు,ఏజెంట్లు శ్రీధర్,రవి కుమార్,డీజీఎంలు ఎస్.అనిల్ కుమార్, రాజన్న,ఆనంద్ కుమార్, రవీందర్, మల్లయ్య,విజయ్ కుమార్,వివిధ గనుల మేనేజర్లు,పిట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**సారంగాపూర్,ఫిబ్రవరి9(జనం సాక్షి)**

12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్ల రాజన్న పిలుపునిచ్చారు.

సారంగాపూర్ మండల కేంద్రంలోని చించోలి (బి), కౌట్ల (బి) గ్రామాల్లోని బీడీ ఫ్యాక్టరీల్లో సోమవారం సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తోందని, నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బక్కన్న, కార్యదర్శి రామ్ లక్ష్మణ్ల దితరులు పాల్గొన్నారు

# వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలి



ఐటిడిఎ పీఓ యువరాజ్ మార్మాట్

కడెం: ఫిబ్రవరి 9(జనం సాక్షి)గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషకాహారం అందించాల్సిందిగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అధికారులను ఆదేశించారు. మంగళవారం దస్తురాబాద్, కడెం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, కడెం (బాలురు) గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, భోజన ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి భోజన నాణ్యత, సమయపాలనపై ప్రశ్నించారు. వండిన ఆహారాన్ని పరిశీలించి కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. కడెం ఆశ్రమ పాఠశాలలో 170 మంది విద్యార్థుల్లో 115 మంది మాత్రమే హాజరై ఉండగా, హాజరు నమోదు తప్పుడు విధంగా చేయడంపై వార్డెన్‌ను హెచ్చరించారు. దస్తురాబాద్ పాఠశాలలో పల్స్ యాప్ అప్‌డేట్ చేయకపోవడం, నెట్‌వర్క్ కారణాలు చూపడం, తక్కువ మోతాదులో భోజనం అందించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పల్స్ యాప్ పనితీరుపై సమీక్షించి, సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారించేందుకు వసతి గృహాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఒక్క పాల్గొన్నారు.

# ఈవీ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్‌పై అవగాహన కార్యక్రమం



వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 09 (జనం సాక్షి)జాతీయ సాంకేతిక సంస్థ, వరంగల్ (నిట్ వరంగల్)లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సి ఆర్ ఐ ఎఫ్), హయోకి ఇండియా సహకారంతో మరియు వస్తే టెక్నాలజీస్ భాగస్వామ్యంతో, ఎలక్ట్రిక్ వెహికల్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ? ప్రాక్టికల్ డెమోన్‌స్ట్రేషన్ , ఎక్స్‌పో (ఈవి మరియు బి ఎం ఎస్?2026) పై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని 9 ఫిబ్రవరి 2026న విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం లక్ష్యం ఎలక్ట్రిక్ వాహనాల పవర్ యూనిట్ల సురక్షిత పనితీరు, సామర్థ్యం మరియు దీర్ఘకాలిక వినియోగాన్ని నిర్ధారించడంలో బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ లోని ఆధునిక సాంకేతిక నిర్మాణం మరియు భద్రతా ప్రోటోకాళ్ల ప్రాధాన్యతను వివరించడం. ముఖ్యంగా, థర్మల్ మేనేజ్‌మెంట్, ఓవర్ వోల్టేజ్, ఓవర్ కరెంట్, ఓవర్ చార్జ్ రక్షణ, స్టేట్ ఆఫ్ చార్జ్ , డెప్త్ ఆఫ్ డిశ్చార్జ్, పూర్తి చార్జ్?డిశ్చార్జ్ చక్రాల నిర్వహణ మరియు వాహన భద్రత వంటి అంశాలపై మేధస్సుతో కూడిన మరియు సమర్థవంతమైన బ్యాటరీ మానిటరింగ్ వ్యవస్థల రూపకల్పనకు అవసరమైన నైపుణ్యాలను అభ్యాసకులకు అందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం.సాంకేతిక సెషన్ల అనంతరం పరికరాల ప్రత్యక్ష ప్రదర్శన మరియు సదుపాయాల సందర్శన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సంస్థలోని అత్యాధునిక పరిశోధనా మౌలిక సదుపాయాలను పాల్గొన్నవారికి పరిచయం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి గారు ప్రారంభించి, స్థిరమైన గ్లోబల్ అభివృద్ధి సాధనలో పరిశ్రమ?విద్యా సంస్థల సహకారం, పరిశోధన మరియు సాంకేతిక నవోన్మతుల ప్రాముఖ్యతను వివరించారు.సి ఆర్ ఐ ఎఫ్ ప్రతినిధి ప్రొఫెసర్ ఏ. వీరేష్ బాబు , బహుశాఖ పరిశోధనలు మరియు పరిశ్రమలతో సహకారానికి తోడ్పడే విధంగా అందుబాటులో ఉన్న ఆధునిక సదుపాయాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ ఉదయ భాస్కర్ ఎం మరియు శ్రీ వి. సుధాకర్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. హయోకి ఇండియా ప్రతినిధులు శ్రీ రాజ్ సాన్ మరియు శ్రీ గోల్డెన్ సాన్, టెక్నాలజీస్ సంస్థలు సంయుక్త పరిశోధన మరియు సామర్థ్య వృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.ప్రారంభ కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, సాంకేతికాధికారులు శ్రీ డి. రవి కుమార్, శ్రీమతి జీవన్‌ఆర్ సంజీవిని మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి నిట్ వరంగల్‌తో పాటు సమీప సంస్థల నుంచి 140 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధకులు మరియు సాంకేతిక సిబ్బంది హాజరై, ఎలక్ట్రిక్ వాహన సాంకేతికతలు మరియు బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ రంగంలో నైపుణ్యాల అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.

# కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



జనగామ ప్రతినిధి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి):మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జనరల్ అబ్జర్వర్ నర్సింహా రెడ్డి ల సమక్షంలో సోమవారం నిర్వహించారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ ని నిర్వహించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న జనగాం, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. జనగాం మున్సిపాలిటీ కి సంబంధించి.. 30 వార్డ్స్ లో 66 పోలింగ్ స్టేషన్స్ కి 20% రిజర్వ్ తో 80 ఖూ, 80 ఒఖూ, 240 ాఖూ, లు స్టేషన్ ఘనపూర్ కి సంబంధించి...18 వార్డ్స్ కి 36 పోలింగ్ స్టేషన్స్ కి 20% రిజర్వ్ తో 44 ఖూ, 44 ఒఖూ, 132 ాఖూ లను ర్యాండమైజేషన్ ద్వారా నియమించారు. జనగాం మున్సిపాలిటీ కి సంబంధించి 26 పోలింగ్ లొకేషన్ లకు 28 మంది, ఘనపూర్ కి సంబంధించి 7 లొకేషన్ లకు 9 మంది మైక్రో అబ్జర్వర్ లను కూడా ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమం లో స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, నోడల్ అధికారి హౌసింగ్ పీడీ మాత్రు నాయక్, ఇఆఓ గౌతమ్ పాల్గొన్నారు.

# ఘనంగా మాత రమాబాయి జయంతి



బాసర, ఫిబ్రవరి 09 (జనం సాక్షి)నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని ఓని గ్రామంలో మాతరమాయి అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బుద్ధ విహార్ కమిటీలో సోమవారం మాత రమాబాయి అంబేద్కర్ 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ ఉపాసక ఉపాసికులు అందరు పాల్గొని ముందుగా ప్రపంచ శాంతి దూత గౌతమ బుద్ధుని అదేవిధంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మాత రమాబాయి చిత్రపటాలకు పూలమాలతో నివాళులు అర్పించారు. అనంతరం బుద్ధవందన ధర్మవందన సంఘం వందన త్రిశరణ పంచశీల సామూహికంగా తీసుకున్నారు. అలాగే కొందరు వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగం రాసిన వ్యక్తి అని ఆయన సతీమణి అయిన రమాబాయి త్యాగాలు ఎన్నో చేశారని ఆయన విదేశాల్లో చదువుకునేటప్పుడు రమాబాయి ఆర్థిక పరిస్థితి బాగాలేక తమ ఇద్దరు సొంత కొడుకులను పోగొట్టుకొని సమాజం కోసం నిలబడి ఎన్నో అష్ట కష్టాలు పడి, పస్తులు కాశి దేశం కోసం నిలబడ్డారని అన్నారు. వారి గురించి ఎంత చెప్పినా తక్కువేనని వారిని ప్రతి ఒక్కరూ మహిళలు ఆదర్శంగా తీసుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం తో పాటు రమాబాయి మహిళ సంఘ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం

## పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలి



వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 9 (జనంసాక్షి):మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నర్సంపేట, వర్ధన్నపేట పట్టణాలలో ఈ రోజు (ఫిబ్రవరి 09వ తేదీ) సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కాగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ రోజు సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

# జిపిఓ లకు సర్వీస్ ప్రొబేషన్ డిక్లరేషన్ చెయ్యాలి




మల్హర్,ఫిబ్రవరి09(జనం సాక్షి)రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా లోని అన్ని మండల కేంద్రాల్లో జిపిఓలుగా విధులు నిర్వహిస్తున్న మేము గతంలో విఆర్ఏ లుగా జీవో నెంబర్ 81 ద్వారా పదోన్నతి పొంది, ప్రస్తుత డైరెక్ట్ రిక్రూట్ మెంట్ జిపిఓ లుగా పదోన్నతి పొందిన ఉద్యోగానికి సంబంధించిన ఆర్డర్ కాపీ జూనియర్ సహాయకులుగా, రికార్డ్ అసిస్టెంట్ గా,లాస్ట్ గ్రేడ్ సర్వీస్ లుగా గతంలో నిర్వహించడం జరిగింది.రెండు సంవత్సరాలు అయిపోయినందున మాకు సర్వీస్ ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలనీ తహశీల్దార్ కే రవి కుమార్ కూ వినతిపత్రం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలన అసోసియేషన్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సిహెచ్.స్వర్ణలతఉపాధ్యక్షులు ఎం.రాజు,జనరల్ సెక్రటరీ గొట్టం నరేష్,సిహెచ్ రాజు,ఎం.రాజేందర్ పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరికలు



**గూడూరు, ఫిబ్రవరి 09(జనంసాక్షిల):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని కొబల్ తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ మూడు కమల-శ్రీన్,నూతనంగా ఎన్నికైన 7వార్డు సభ్యులు ఇస్లావత్ సుమన్,8వ,వార్డు సభ్యులు మూడు బాలు నాయక్, యూత్ నాయకులు గూగులోతు బాలాజీ నాయక్,కార్యకర్తలు దారావత్ శ్రీనివాస్,నునావత్ అనీల్ లు, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కార్యక్రమాలు నచ్చక గూడూరు మాజీ జెడ్పిటిసి మహమ్మద్ ఖాసిం ఆధ్వర్యంలో కోబల్ తండా సర్పంచ్ బోడ కవిత భాస్కర్,ఉప సర్పంచ్ లావుడియా బాలాజీ చౌహాన్,నాయకత్వములో సోమవారం మహబూబాబాద్ మాజీ శాసన సభ్యులు బానోత్ శంకర్ నాయక్ సమక్షంలో బిఆర్ ఎస్ పార్టీలో చేరారు.అనంతరం వారికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినారు.సొంతగూటికి చేరిన ఊట్ల గ్రామ మాజీ ఉపసర్పంచ్.గూడూరు మండలం ఊట్ల మాజీ ఉప సర్పంచ్ లింగాల శ్రీరాములు బీజేపీ పార్టీకి రాజీనామా చేసి గూడూరు మాజీ జెడ్పిటిసి మహమ్మద్ ఖాసిం ఆధ్వర్యంలో ఊట్ల సర్పంచ్ సభవాత్ భారతి రాజు నాయక్ సమక్షంలో సోమవారం మహబూబాబాద్ మాజీ శాసన సభ్యులు బానోత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో క్యాంప్ ఆఫీస్ లో ఆయనకు బి ఆర్ ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ,మండల నాయకులు బెజ్జం రమేష్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి భాషిపాక నవీన్ కుమార్, కార్యకర్తలు అమ్ము,బాలు,నామ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులకు మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఈ నెల 11న జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ఎన్నికల సంగం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా ర్యాన్డమైజేషన్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పూర్తిగా పాటిస్తూ సిబ్బందిని కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.ఎన్నికల సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహనతో, సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సుశ్రుత. దేవర్షుల ఏడవ వర్ధంతి

### నివాళ్లర్పించిన ప్రజాసంఘాల బాధ్యులు, కుటుంబ సభ్యులు



**పాలకుర్తి, ఫిబ్రవరి 09(జనంసాక్షి):** సుశ్రుత, దేవర్షులది కుల దురాహంకార హత్యలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారపు సరోజన అన్నారు. సోమవారం మండలంలోని గూడూరులో సుశ్రుత, దేవర్షుల ఏడో వర్ధంతిని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో సుశ్రుత తల్లి కోమల, కుటుంబ సభ్యులతో కలిసి సమాధుల వద్ద పుష్పగుచ్చం ఉంచి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సరోజన మాట్లాడుతూ కుల దురహంకార హత్యలు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అత్యధికంగా జరిగాయని విమర్శించారు. నేర, న్యాయ విచారణ జరుగకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల కుల దురహంకార హత్యలు పెట్రేగి పోయాయని అన్నారు. ప్రజాపాలన చేస్తున్నామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి హత్యలను అరికట్టలేక పోతోందని ఘాటుగా విమర్శించారు. ఈ కుల దురహంకార హత్యలను అరికట్టడానికి కులాంతర వివాహితుల రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సుశ్రుత తల్లి కందిక కోమల, ఆ సుఘం జిల్లా కన్వీనర్ గుండె ప్రమోద్, విలాస్, స్వప్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాకవి అందెశ్రీ సంకలనంలో భాగమైన కాటారం వాసి గౌరోజు సదానందం

### పేదింటి బిడ్డకు అరుదైన గౌరవం



కాటారం ఫిబ్రవరి 9( జనం సాక్షి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల వాసి గౌరీ సదానందం అరుదైన గౌరవం దక్కింది. ప్రజా కవి అందెశ్రీ సంకలనం పేరిట రచించిన పుస్తకంలో కాటారం మండల కేంద్రం గారేపల్లి గ్రామానికి చెందిన గౌరోజు సదానందం ( యోగ గురువు ) రచించిన కవితలను పొందుపరిచారు. దీంతో కాటారం వాసికి అరుదైన గౌరవం లభించింది.భవాని సాహిత్య వేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో ప్రజాకవి అందెశ్రీ కవితా సంకలనం పుస్తకావిష్కరణ హైదరాబాద్ త్యాగరాయ గాన సభ గండవరపు హనుమంతరావు కళావేదికల వైభవంగా నిర్వహించారు. ఈ కవితా సంకలన పుస్తకావిష్కరణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బైసా దేవదాసు నేటి నిజం పత్రికా సంపాదకులు, డాక్టర్ నాళేశ్వరం శంకరం, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు. శ్రీ పాణ్యం దత్త శర్మ, ప్రముఖ కవి రచయిత కాలమిస్ట్లు. వచనకర్త శ్రీ మౌనశ్రీ మల్లిక్ సినీ టీవీ గేయ రచయిత రచయితలు పాల్గొన్నారు. అతిథులందరూ సభను ఉద్దేశించి మాట్లాడుతూ సంకలనంలో ప్రచురించిన కవితలు అద్భుతంగా ఉన్నాయని కవి హృదయం ఎప్పుడూ అన్ని రకాల కవితలను రాయడానికి సిద్ధంగా ఉండాలని ముఖ్యంగా ప్రజలను చైతన్యవంతంగా చేసేవిగా ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే అందెశ్రీ జీవితంలోని కొన్ని ఉదంతాలను ఉటంకించారు.ఈ కవితా సంకలనంలో కాటారం నుండి గౌరోజు సదానందం బాపూజీ యోగాచార్యులు మోటివేషనల్ స్పీకర్. కవితలు పంపగా శీర్షికలు కూడా ప్రజాకవి అందే శ్రీ పుస్తకంలో ప్రచురించడం జరిగింది. వాటిని చూసిన ముఖ్య అతిధులు వారి కవితల పట్ల స్పందిస్తూ ఇలాంటి కవితలు ఇంకా రావాలని ముందు తరాల కవులకు ఆదర్శంగా నిలవాలని సదానందంను అభినందించారు. పత్రం సీల్డ తో సత్కరించారు. ఈ సందర్భంగా గౌరోజు సదానందమును గ్రామస్తులు, మిత్రులు మంచి అవకాశం కలిగినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి

### ఆర్టీఐ నాయకులు కుమార్ యాదవ్



**మల్హర్, ఫిబ్రవరి 09(జనంసాక్షి)** 8 ఏళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన శ్రీకాంత్,గణేష్ అనే నిందితులను కఠినంగా శిక్షించాలని యునైటెడ్ ఫోరమ్ పర్ ఆర్టీఐ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు గౌడ్,కాటారం సబ్ డివిజన్ కన్వీనర్ చింతల కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన తాడిచర్ల లో మాట్లాడుతూ పొనగండ్ల గ్రామం, రేగొండ మండలం లో జరిగిన సంఘటన చాలా బాధాకరం అని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన అవి ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. చిన్నారి అత్యాచార ఘటన తమనుగ్ర్భాంతికి గురి చేసిందని,అభం శుభం తెలియని చిన్నారిపై ఈ ఘటన జరగడం అత్యంత హేయమైన చర్యన్నారు.దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా తెలిపారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని,పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు.కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి త్వరితగతిన న్యాయం చేయాలన్నారు.బాధిత చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉండాలని కోరారు.

## లేబర్ కోడ్ లను రద్దు చేయాలి : మాడే రవి



### ఈనెల 12 న జరిగే దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలి

### సిఐటియు మండల కన్వీనర్ మాడే రవి

**మంగపేట,ఫిబ్రవరి 09(జనంసాక్షి)** బిజెపి ప్రభుత్వం తీసుకోవచ్చునా నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ మాడే రవి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ ఆవరణంలో నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి అని సమ్మె చేపట్టగా సిఐటియు మండల కన్వీనర్ మాడే రవి సమ్మెలో పాల్గొని ఈ నెల 12 న దేశవ్యాప్తంగా జరిగే సమ్మె లో అందరూ పాల్గొని దేశవ్యాప్తసమ్మె ను జయప్రదం చేయాలి అని కోరారు. అనంతరం ఆయన రవి మాట్లాడుతూ భారత దేశంలో పనిచేస్తున్న కార్మిక వర్గం తమ ప్రాణాలను సైతం త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లోని 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసిన 4 లేబర్ కోడ్ లను బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆ చట్టాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం తరుపున ఆరు సంవత్సరాల కాలంగా ఆందోళనలు, పోరాటాల ఫలితంగా అనే వాటిని అమలు చేయకుండా అడ్డుకుందామని కానీ మళ్ళీ మోడీ ప్రభుత్వం 2025 నాడు నవంబర్21 న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడుదారులు, కార్పొరేటర్ల సంస్థల కొరకు నోటిఫికేషన్ జారీ చేసిందని రవి అన్నారు. కార్మిక లోకానికి వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకోవచ్చి కార్మిక వర్గంపై అణచివేతలు చేస్తున్న బిజెపి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 12 న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని వారు తెలిపారు. ఈ సమ్మెలో అందరూ పెద్దఎత్తున పాల్గొని కార్మిక లోకానికి మద్దతుగా నిలవాలని రవి కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కుర్సం చిరంజీవి, గ్రామపంచాయతీ కార్మికులు బాడిషా విశ్వనాథం, బాడిషా రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలి

- గ్రామ సభలో గ్రామస్తుల డిమాండ్
- మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోవడం లేదు....
- గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేసి శాశ్వతంగా మూసివేయాలి....




**ఆత్మకూర్, ఫిబ్రవరి 9 (జనం సాక్షి):** ఆత్మకూరులో గల్లి గల్లి కి విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో అధిక ధరలకు అమ్ముతూ చేస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని వెంటనే మూసివేయాలని గ్రామసభలో గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచి పర్వతగిరి మహేశ్వరి- రాజు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో నిర్వహిస్తుండగా గ్రామస్తులు,మహిళలు బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అధిక ధరలకు అమ్ముతున్న కూడా అధికారులు మామూళ్ల మత్తులో ఉండి పట్టించుకోవడంలేదని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. వెంటనే గ్రామస్తులు అందరూ బెల్ట్ షాపులను ముగించాలని ఏకగ్రీవ తీర్మానం చేయాలని పట్టుబట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్వేత జోక్యం చేసుకొని బెల్ట్ షాపులు మూయించే విధంగా ఏకగ్రీవ తీర్మానం చేసి అధికారుల దృష్టికి తీసుకుపోతామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కెనరా బ్యాంకులో ముద్ర రుణాలు ఇవ్వడం లేదని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్ బ్యాంక్ అధికారులను ప్రశ్నించారు. గ్రామస్తుల కోరిక మేరకు మేనేజర్ దృష్టికి తీసుకుపోయి ఎలాంటి షూరిటీ లేకుండా ముద్ర రుణాలు ఇచ్చే విధంగా చూస్తామన్నారు. అలాగే గృహ రుణాలు కూడా తక్కువ వడ్డీకే అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి- రాజు మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం నిరుపేదలందరికీ ముద్ర రుణాలు వచ్చే విధంగా బ్యాంక్ అధికారులతో మాట్లాడి ఇప్పించే విధంగా చూస్తానని భరోసా ఇచ్చారు. అలాగే గ్రామంలోని బెల్ట్ షాపులన్నీటిని గ్రామస్తుల కోరిక మేరకు మూసి వేసే విధంగా చూస్తామని గ్రామస్తులకు సర్పంచ్ భరోసా ఇచ్చారు. ఎక్సైజ్ పోలీసులతో మాట్లాడి, అలాగే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకుపోయి ప్రజల సౌకర్యం కోసం బెల్ట్ షాపులు లేకుండా చేయడంతో పాటు మాదక ద్రవ్యాలైన గంజాయి పై ఉక్కు పాదం మోపి విధంగా చూస్తామన్నారు. విద్యార్థులు మత్తుకు బానిసలు అవుతున్న విషయం మా దృష్టికి వచ్చిందని వెంటనే పోలీసులతో మాట్లాడి నిత్యం తనిఖీలు చేయిస్తామన్నారు. ఈ గ్రామసభలో ఉపసర్పంచి భాష బోయిన పైడి, వార్డ్ మెంబర్లు, అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియన్ కరాటే పోటీల్లో గీతాంజలి విద్యార్థుల విజయం



**నర్సంపేట ఫిబ్రవరి 9 ( జనం సాక్షి) :** ఆల్ ఇండియన్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ వారు 2026 సంవత్సరంకుగాను నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న గీతాంజలి విద్యార్థులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులను తమ నైపుణ్యాలను ఉపయోగించి వారిని చిత్తు చేసి ప్రథమ బహుమతులు సాధించారు. విజయం సాధించిన క్రీడాకారులకు నర్సంపేట కరాటే మాస్టర్, టోర్నీ ఇన్చార్జ్ రచ్చ శ్రీనివాస్ బహుమతులు ప్రధానం చేశారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు . బహుమతులు సాధించిన పి.సమన్విత .మరియు పి.సాత్విక్ .ను అభినందించారు భవిష్యత్తులో ఇలాంటి అనేక విజయాలు సాధించి ఎదుటివారికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎన్ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి విజయం సాధించడం అంటే మన బాధ్యత మరింత పెరిగిందని తెలుసుకొని మీరు సాధించిన విజయాలను చూసి గర్వపడకుండా భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలని తెలిపారు క్రీడల పైన మక్కువ చూపి విజయం సాధించడం అందరికీ సాధ్యం కాదని దానికి ఎంతో ఏకాగ్రత, కృషి ,పట్టుదల కావాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు.



## చిన్నారి పై అత్యాచారం అమానవీయం

- చట్ట భయం లేకపోవడమే దీనికి కారణం
- ఘటన పై పూర్తి బాధ్యత ప్రభుత్వమే భరించాలి
- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి

**రేగొండ,ఫిబ్రవరి 09( జనం సాక్షి):** మండలంలోని పొనగండ్ల గ్రామంలో ఆదివారం 8 ఏళ్ల చిన్నారిపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన దారుణ ఘటనను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. చిన్నారులు, మహిళలకు కనీస భద్రత లేకుండా పోయిందనీ దీనికి నిదర్శనమే ఈ అమానుష ఘటన అని విమర్శించారు. చిన్నారిపై జరిగిన ఈ ఘోరం మానవత్వానికే మచ్చ. చట్టభయం లేకపోవడం వల్లే ఇలాంటి నేరాలు పెరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని నిందితులను వెంటనే అరెస్టు చేసి, కఠిన శిక్ష విధించాలి అని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయడంతో పాటు అన్ని విధాలా ప్రభుత్వ సహాయం అందించాలన్నారు. బీజేపీ తరపున బాధిత కుటుంబానికి పూర్తి మద్దతు ఉంటుందనీ నిందితులకు కఠిన శిక్ష పడే వరకు మా పోరాటం కొనసాగుతుందని తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు.

## మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్, చంద్రశేఖర్**




**ఏటూరునాగారం, ఫిబ్రవరి 09(జనంసాక్షి) :** గవర్నమెంట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఎంజీఎంఎల్టివి) ములుగు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏటూరునాగారం కేంద్రంలో గౌరవ సలహాదారులు కోరెం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటే శ్రీనివాస్, చిడెం చంద్రశేఖర్ లు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం పూర్తి కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యవర్గ ఉపాధ్యక్షుడిగా బోదెబోయిన గురుదేవ్, పండు నర్సింగరావ్, మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా రజిత, లలిత రాణి, సహాయక అధ్యక్షులుగా గట్టుపెల్లి రాంబాబు, ఇర్ప రజినీకాంత్, బిజ్జ శిల్ప, కోశాధికారిగా గొంది నవీన్, గౌరవ సలహాదారుడిగా కోరెం శ్రీనివాస్, కార్యనిర్వహణ సభ్యులుగా అశ్విని, బొగ్గం సూర్య, కూరపాటి ప్రవీణ్ కుమార్, కుడుములు కిరణ్, గణేష్, తొలెం వైష్ణవ్, పెనక కృష్ణవేణి, మునిగాల పూజిత, సునార్కని సందీప్ కుమార్, సోయం అరుణ్ లను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కోటి శ్రీనివాస్ మాట్లాడుతూ గవర్నమెంట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సేవా నాణ్యత పెంపుదల కోసం సంఘం కృషి చేస్తుందని వారన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



**పాలకుర్తి, ఫిబ్రవరి 09(జనంసాక్షి) :** కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్ల నర్సింహులు విగ్రహం వద్ద ఏఐసీసీటీయు నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు మాంకాళి శ్రీనివాస్ మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాసేం దుకు కేంద్రం నాలుగు లేబర్ కోడ్లను తీసుకువ చ్చిందని విమర్శించారు. దీంతో కార్మికుల పై మోయలేని భారం మోపిందన్నారు. ఈ నెల 12న చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం-ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య, జీడి సోమయ్య, కలింగరాజు, గాయాల బాబు, తూర్పాటి సారయ్య, నారగోని ఎల్లయ్య, గుమ్మడి రాజుల క్రాంతి శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి

**డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్**



**మహబూబాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 09(జనం సాక్షి):** మహబూబాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా డి.ఎస్.ఎఫ్.ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ సోమవారం పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. పట్టణ అభివృద్ధి కేవలం బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.డాక్టర్ వివేక్ తన బృందంతో కలిసి మున్సిపాలిటీలోని 04,05,31,10,20,27 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రతి ఇంటికీ చేరువయ్యాయని, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలని,ప్రచారంలో భాగంగా ప్రతి వార్డులోనూ ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు,వార్డుల పర్యటనలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, ప్రజలకు వివరించారు.వార్డుల అభివృద్ధికి కట్టుబడి ఉండే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి, మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడపాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ డి.ఎస్.ఎఫ్.ఐ జాతీయ నాయకులు మాలోత్ శాంతి కుమార్,రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయికుమార్, కోశాధికారి గుగులోతు సూర్య ప్రకాష్, శ్రీకాంత్,ఎర్ర దిలీప్, బానోత్ దేవేందర్,రమేష్, శివ వర్మ కొప్పుల కిరణ్, తదితరులు స్థానిక బిఆర్ఎస్ ప్రతినిధులు మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి ఈ కేవైసీ తప్పనిసరి

**సైబర్ నేరాలపై అవగాహన సదస్సు**
**పోస్టర్ ను ఆవిష్కరించిన అధికారులు**



**ములుగు బ్యూరో, ఫిబ్రవరి 9 (జనం సాక్షి):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి పిలుపుమేరకు కేవైసీ సురక్షితమైన బ్యాంకింగ్ సంబంధించి అవగాహన పెంచేందుకు ఆర్థిక అక్షరాస్యత వారం గా నిర్వహిస్తోంది. ఈనెల 9వ తేదీ నుండి 13వ తేదీ వరకు ములుగు జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుంది. సైబర్ నేరాలపై దృష్టి పెట్టి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని జి.జయ ప్రకాష్ లీడ్ బ్యాంకు జిల్లా అధికారి అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం రోజున అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) మహేందర్ జి,అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్)సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, రాజ్ కుమార్, ఏవో లు సదరు పోస్టర్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా పలు బ్యాంకు మేనేజర్లు పాల్గొనడం జరిగింది. అనుమతి ఇచ్చిన దివాకర జిల్లా కలెక్టర్ కి ధన్యవాదములు తెలియజేశారు.